ఎత్తరుగుల లోగిలి

పైడిపాల

మా వూరికి తలలో నాగరంలా వుంది బస్‌స్టాప్. పిరుదుల వరకు వేలాడే పల్లెటూరి పిల్ల ఒత్తైన జెడలా వుంది బస్‌స్టాప్ నుండి ఊళ్లోకి వేసిన నల్లని తారు రోడ్డు.

కిందటి సారి వచ్చినపుడు తారు రోడ్డు లేదు. ఈ మధ్యే కొత్తగా వేసినట్టున్నారు. మా స్టాప్‌లో 'ఎక్స్‌ప్రెస్ బస్'లు ఆగవు. కండక్టరును 'కాకా' పట్టి కిలోమీటరు దూరం ముందు నుంచీ 'బ్రీఫ్‌కేస్'తో డోర్ దగ్గర విలబడి—నానా హైరానా పడి ఎలాగయితేనేం ప్రయోజకుడి ననిపించుకున్నాను. బస్ దిగేసరికి ఆ స్థలమంతా నిర్మానుష్యంగా వుంది -- సద్దుమణిగిపోయిన పెళ్లివారిల్లులా. ఓ మూలగా గంగరావి చెట్టు కింద నాలుగైదు రిక్షాలు—ప్రభుత్వం పేదలకు కట్టించి యిస్తున్న కాలనీలోని ఇళ్లలా. దగ్గరకెళ్ళి చూశాను— ఎవరైనా మెలకువగా ఉన్నారేమోనని. ఎవరి మట్టుకు వాళ్ళు ముడుచుకొని పడుకొన్నారు.

"ఏవోయ్ రిక్షావాలా"

ఒకసారి పిలిచేసరికే ఒకడు బదులు పలికాడు.

"ఎవరింటికి బాబూ ?"

"శాస్త్రుల గారింటికి"

వాడులికిపడి లేచి నావంక తేరిపారి చూశాడు.

"మీరా పెద్దబ్బాయిగారూ ? సాన్నాళ్ళయింది మిమ్మల్ని సూసి.. అయిద్రాబాదులో కదూ వుంటున్నారు ? రండి బాబూ" అంటూ రిక్షా సిద్ధం చేశాడు.

మా వూళ్ళో వైదిక బ్రాహ్మణుల కుటుంబాలు చాలా కాకపోయినా మాతోపాటు మరికొన్ని వున్నాయి. కాని అబాలగోపాలానికి 'శాత్రులు' గారంటే మా నాన్నగారు సాంబశివ శాస్త్రి గారే. ఆయన పేరు పట్టుబడక పోవడం కొంత, ఆయన పేరు ప్రఖ్యాతులు మరికొంత — ఆయనను ఆ వూరికి ఏకైక శాస్త్రిని చేశాయి. ఆయనంత కాకపోయినా చాలా మంది నన్ను కూడా పెద్దబ్బాయిగారనే పిలుస్తారు. మరి మా తమ్ముణ్ణి మాత్రం చాలా మంది పేరుపెట్టి 'మాధవశాస్త్రి'గారనే అంటారు.

రిక్షా వేగానికి చలిగాలి ఉధృతమయింది. చెవులకు చుట్టుకొన్న మఫ్లరు బిగించాను. రోడ్డు మీద రిక్షా మువ్వల లయబద్ధమైన శబ్దం తప్ప మనుషుల అలికిడి లేదు. పల్లెటూరి ప్రశాంతమైన వాతావరణం కలిగిస్తున్న ఆహ్లాదం ప్రయాణపు బడలికను మరపింపజేస్తోంది.

నేను వస్తానని మాధవ అనుకోడు. నేను తీసుకొచ్చిన వార్త విని మరీ ఆశ్చర్యపడతాడు. ఆపైన ఆనందపడతాడు కూడా. ఎటొచ్చీ మరదలు రాధకి మాత్రం ఈ సంబంధం నచ్చుతుందో లేదో అని నా కనుమానమే. ఎస్టేటులూ, జిల్లా కలెక్టరు గిరీవున్న సినిమా హీరోలాంటివాడు అల్లుడిగా రావాలనే ఆమెను తృప్తిపరచడం సాధ్యం కాదు. ఈ మాట నేను బయల్దేరేటప్పుడే విశాలితో అన్నాను.

విశాలి మాత్రం ఈ సంబంధం ఎలాగైనా ఖాయం చెయ్యాలని పట్టుదలగా వుంది. 'ఎలాగూ ఆఫీసు పనిమీద విజయవాడ వెళుతున్నారు కదా — అక్కడ్నుంచి ఇంకెంత దూరం ? వెళ్ళిరండి మీ వాళ్ళని చూసినట్టూ వుంటుంది. ఈ ఖబురు చెప్పినట్టూ వుంటుంది. ఆస్తిపాస్తులు లేకపోయినా ఇంజనీరు ఉద్యోగం చేస్తున్న అబ్బాయి పైసా కట్నం లేకుండా దొరకడమంటే అదృష్టం కదూ? అయినా ముగ్గురమ్మాయిలూ పెళ్ళికెదిగారు. ఇంకా ఎంత కాలం చీమ కుట్టనట్టు కూర్చుంటారు వాళ్ళు ? వాళ్ళకి తెలియకపోయినా ఇంటికి పెద్దగా మిమ్మల్ని లోకులేమంటారు ? మీరు మాధవకి నచ్చజెప్పండి. ఇది కాస్తా చెయ్యి జారిపోతే మళ్ళీ ఇలాంటి అవకాశం రాదు" గట్టిగా నన్ను హెచ్చరించి మరీ పంపించింది విశాలి.

తమ్ముడు మాధవకి ముగ్గురూ ఆడపిల్లలే. పెద్దది కళ్యాణి. ఇరవై పైబడినా ఇంకా కళ్యాణానికి నోచుకోలేదు. ఆడపిల్ల పెళ్లి చెయ్యడం యజ్ఞంగా భావింపబడుతున్న ఈ రోజుల్లో రాధకి మాత్రం ఏ సంబంధమూ ఓ పట్టాన నచ్చడంలేదు. ఎవరైనా పిల్లల పెళ్ళిళ్ల ప్రసక్తి తీసుకొస్తే 'ఆ — తొందరేముంది ? ఇంకా పెద్దదానికి పదహారే కదా ?' అంటుంది. నలభయ్యో పడిలో వున్నా తను కూడా పాతికేళ్ళ పడుచులా అలంకరించుకొంటుంది. ఆమె మాటకు ఆ యింట్లో తిరుగు లేదు. అందుకే మాధవకి నచ్చ జెప్పి కూడా ప్రయోజనం లేదని నాకు తెలుసు. అయినా నా ప్రయత్నలోపం లేదనిపించుకోవాలని ఈ ప్రయాణం.

విశాలి చెప్పినట్టు 'పెద్దబ్బాయిగారికిద్దరూ మగాళ్ళే గనుక బాధలేదు. పిల్లలిద్దరూ పెద్ద చదువులు చదువుకుంటున్నారు గనుక నగరంలో సుఖంగా వుంటూ తమ్ముడి పిల్లల గురించి బాధ్యత తీసుకోలేదు. శాస్త్రులు గారుంటే ఇలా వూరుకొనేవారా ?' అని వూళ్ళోవాళ్ళు అపవాదులేస్తారనే భయంతో ఈ పనికి పూనుకోవాల్సి వచ్చింది—నిజంగా సంబంధం సెటిలయినా రాధతో ఎటు నుంచి ఎటు వస్తుందోననే ఆందోళన కొంత వున్నా.

"వచ్చేశాం బాబూ, దిగండి" అనే రిక్షావాడి పిలుపుతో ఆలోచనలనుంచి తేరుకున్నాను. రిక్షావాడు వెళ్ళిపోయిన తర్వాత చీకటిలో మా వీధివైపు చూసిన నాకు 'రిక్షావాడు పొరపాటున ఇక్కడికి తీసుకు రాలేదు కదా ?' అనిపించింది, చూసీ చూడగానే. ఈ అయిదేళ్ళలో వీధిలో చాలా మార్పులొచ్చాయి. మా యింటి స్వరూపం కూడా నేనానవాలు పట్ట లేనంతగా మారిపోయింది. తడుముకొంటూ గుమ్మం దగ్గరకెళ్ళాను.

గుమ్మానికి ఓ పక్కగా గూడు చాపతో వేయబడిన చిన్న గుడిసె. దాని నానుకొని ఓ మనిషి గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అతనికి దగ్గరలో ఓ చేతి కర్ర వుంది. గుడిసె ముందు ఓ గుడ్డి లాంతరు వెలుగుతోంది. గుడిసెలోంచి ఓ కుక్క ఏదో వస్తువును పట్టుకొని లాగుతోంది. నన్ను ఆశ్చర్యం భయం ఆవహించాయి. గుడిసెలోకి తేరిపారి చూశాను ఒత్తుగా పరిచిన గడ్డి మీద తుంగచాప. దాని మీద

ఓ మానవాకారం ...! విస్తుపోతూ ఆ లాంతరు వెలుగులో గురక పెడుతున్న వ్యక్తి ముఖాన్ని పరిశీలనగా చూశాను— సందేహం లేదు, యతిరాజులు !

"ఒరేయ్ రాజులూ, రాజులూ" గట్టిగా పిలచాను. వాడు గాబరా పడుతూ లేచాడు.

"మీరా పెద్దబ్బాయిగారూ? ఎప్పుడొచ్చారు?"

"ఇప్పుడే కాని గడ్డిలో వేసింది...!"

"ఎంకట సాత్రులుగారు బాబూ. మాటపడిపోయి వారమయింది. డాట్టర్లు నాబంలేదని సెప్పేశారు. గురక తగ్గిపోయి నట్టుంది... మడిసిని సూడండి బాబూ"

గుడిసెలోని వ్యక్తి మీద చెయ్యేసి చూశాను. మంచు గడ్డలా చేతికి చల్లగా తగిలింది. నా ఒళ్ళు నీరయిపోయింది.

"ప్రాణం పోయిందిరా. తమ్ముడేడి?"

"లోపలున్నారు. లెగ్గొట్టు కొత్తానండి" హడావిడిగా వెళ్ళి తలుపు కొట్టాడు.

అంతా బయటకొచ్చారు. సన్నగా ఏడ్పులు ప్రారంభమయ్యాయి. నాకు కూర్చునే స్థలం లేదు. అలాగే గోడకి చేరబటిపోయాను...

* * *

శ్రీనాధుడు భీమఖండంలో వర్ణించినట్టు మాది జోడరుగుల లోగిలి. దానిలో రెండు వాటా లుండేవి. రెండో వాటా బాబాయి గారిది. బాబాయి పట్నంలో ఉద్యోగస్థుడు కావడం చేత ఆ వాటా కూడా మాకు కలిపేసి పట్నంలో ఇల్లు కొనుక్కున్నాడు.

ఆ సంవత్సరం దీపావళి సమీపిస్తుందనగా ఏదో బాకీ చేతి కందడంతో యింటికి మరమ్మత్తులు చేయిస్తున్నారు నాన్నగారు. అంతవరకు వున్న మట్టి అరుగుల్ని కొంచెం ఎత్తు చేయించి గచ్చు చేయించడం ఆ కార్యక్రమంలో ఓ భాగం. అప్పుడే పట్నం బాబాయి గారింటికి వెళ్ళొచ్చిన పన్నెండేళ్ళ మాధవకి మాత్రం ఆ పని నచ్చలేదు.

"ముసలిదానికి ముస్తాబు చేసినట్టు ఈ పాత యింటికి మెరుగులెందుకు నాన్నగారూ? కట్టుకొంటే బాబాయిగారిల్లులా అందమైన డాబా యిల్లు కట్టుకోవాలి. కుక్కలూ ఆవీ పాడుచెయ్యడానికి కాని

ఎత్తరుగుల లోగిలి

ఈ అరుగులెందుకు ? పోనీ ఈ అరుగులమీద గదులు కట్టించండి. మేం చదువుకోడానికి బావుంటుంది."

మాధవ ఉద్దేశ్యం వేరు. చదువు నెపంతో ప్రత్యేకమైన గదులు తీసుకొంటే రాత్రులు సినిమాలకూ ఆటలకూ వెళ్ళినా యింట్లో తెలియకుండా వుంటుందని. ఇల్లు ఆధునికంగా వుంటుందనే అభిప్రాయంతో అమ్మ కూడా తమ్ముణ్ణి సమర్థించింది. కాని నాన్నగారు అమ్మని మందలించారు.

"చిన్నవాడు. వాడేదో తెలియక మాట్లాడితే నువ్వుకూడా వంత పాడతావా ? అరుగుల అవసరం వాడికి ముందు ముందు తెలుస్తుంది. అరుగు సాంఘిక కార్యకలాపాలకు వేదిక. హిందూమతంలోని మానవతా దృక్పథానికి అది ప్రతీక. మన మతంలోని విశాల దృక్పథానికి భూతదయకూ అరుగు తార్కాణమని వివేకానందుడంతటి మహనీయుడు విదేశాల్లో యిచ్చిన ఉపన్యాసాల్లో వివరించాడు. 'కాకబలి'నీ 'శ్వానబలి'నీ అరుగులమీద వేసిన తర్వాతనే ఆహారం స్వీకరించాలని మనుధర్మశాస్త్రంలో చెప్పలే ? సాంప్రదాయకమైన కుటుంబాన్నుంచి వచ్చిన నువ్వుకూడా ఇలా మాట్లాడ్డం విడ్డూరంగా వుందే ?" అంటూ నాన్నగారు విరుచుకొనిపడ్డంతో అమ్మ కిక్కురుమనలేదు.

'ఆ — నాన్నగారిదంతా చాదస్తం' అంటూ తమ్ముడు కొట్టిపారేశాడు కాని నాకు మాత్రం ఆయన మాటల్లో ఏదో మహత్తరమైన సత్యముందనిపించింది.

దీపావళి నాటి సాయంత్రం పాలికాపు వచ్చి అరుగుల ముందు కర్రలు పాతి వాటికి అరుగు కంటె కొంచెం ఎత్తున అడ్డంగా వెదురుబద్దలు కట్టాడు. ఆ వెదురు బద్దలమీద ఆవుపేడ ముద్దలు వుంచి వాటిపై ప్రమిదలు అమర్చి అమ్మ వత్తుల్ని వెలిగించింది. ఆ రాత్రి మా కుటుంబమంతా అరుగులమీద కూర్చొని దీప తోరణాల్ని చూసి మురిసిపోతూ బాణాసంచా కాల్చుకుంటున్నప్పుడు అరుగులు లేని మా యింటిని ఊహించలేకపోయాను.

ఒక అరుగంతా సొంతం చేసుకొని విష్ణు చక్రాలూ, భూచక్రాలూ కాలుస్తూ ఆనందిస్తున్న తమ్ముణ్ణి చూసి నాన్నగారదే అన్నారు 'గచ్చరుగులు అనవసరం అన్నావు — అవి ఎలా ఉపయోగపడుతున్నాయో చూశావా మాధవా ?' అని.

"మీకు ఎత్తిపొడవడానికి మంచి అవకాశమే వచ్చింది" అని అమ్మ నవ్వింది. తమ్ముడు ఈ మాటల్ని పట్టించుకొనే స్థితిలోలేడు. ఆనందంతో తలమునకలవుతున్నాడు.

ఆ తర్వాత పట్టించుకొనే రోజుకూడా వచ్చింది. మాధవ పెళ్ళికి ఉదయం నుంచి ఒకటే వర్షం భోజనాలకీ ముహూర్తానికీ కూడా వాన తెరపి యివ్వలేదు. వర్షంలోనే నానావస్థలూ పడివచ్చిన అతిథులందరికీ నీడ నిచ్చినవీ, పెళ్ళిని కళ గట్టించినవీ అరుగులూ, చావిడీ.

"నాన్నగారూ, మీరు నా చిన్నప్పుడు అరుగుల గురించి చెపితే ఏమో అనుకున్నానుగానీ ... ఇప్పుడు మాత్రం చాలా ఉపయోగపడ్డాయి" అంటూ ఆ సందర్భంలో మాధవ నాన్నగారి ముందు తన అవివేకానికి తలవంచాడు.

వర్షం పేరు చెపితే నా మనఃఫలకం మీద హత్తుకుపోయిన ఆ సంఘటన గుర్తుకొస్తుంది — అప్పటికి నా వయస్సు పదహారు లోపు. ఆ సంవత్సరం కనీ వినీ ఎరుగని వర్షాలు ... అప్పటికి రెండు రోజుల్నుంచి కుండపోతగా వాన కురుస్తోంది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమైపోయాయి. బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడ్డం వల్ల రాగల రెండురోజుల్లో భారీ వర్షాల, పెనుగాలుల ప్రమాదం వుందని రేడియోలో పదే పదే హెచ్చరికలు చేస్తున్నారు. గుడిసెలు మునిగిపోయిన బీదా బిక్కీ ఆశ్రయం దొరికిన చోటల్లా గుంపులు గుంపులుగా చేరుతున్నారు. ఆ రోజు వుదయం యతిరాజుల కుటుంబం, మరికొందరు వచ్చి అరుగు పక్క చూరుకింద చేరడం నేను గమనించాను. వాళ్ళు వర్షానికి వణికిపోతూ, పైకి రావడానికి భయపడుతూ ఒదిగి ఒదిగి నిల్చున్నారు. వాళ్ళను అరుగు మీదకు రమ్మనాలనిపించింది గాని నాన్నగారేమంటారోనని భయపడ్డాను. సరిగ్గా అదే సమయానికి మడికట్టుకొని సంధ్యావందనం చేసుకోడానికి అరుగు మీదకు వచ్చారు నాన్నగారు. ఆయనను చూసి వాళ్ళు మరింత కంపించి పోయారు.

"సాత్రులు గారూ మా కొంపలు మునిగిపోయాయి. వాన తగ్గేదాకా యిక్కడ నిలబడ్డాం. ఎళ్లిపోతాం. కోప్పడకండి బాబూ." నాన్నగారేమీ అడక్కుండానే యతిరాజులు సంజాయిషీ చెప్పాడు. నాన్నగారి పెదవులపై చిరునవ్వు మెరిసింది.

"మిమ్మల్ని వెళ్ళిపొమ్మని ఎవరన్నారు ? హాయిగా అరుగు మీదకొచ్చి ఆ తడిగుడ్డలు పిండుకొని ఆరేసుకొండి. అమ్మగార్ని ఏమైనా పాత బట్టలుంటే ఇమ్మని అడిగి కట్టుకోండి."

యతిరాజులు హరిజనుడు. సొందీ పని శాస్త్రిగారు వేదాధ్యయనం చేసిన సదాచార సంపన్నులని ఊళ్ళో వాడుక. నాన్నగారి మాటలు వాళ్ళతోబాటు నన్ను కూడా సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాయి.

అంతటిలో ఆగలేదు నాన్నగారు. ఆరెండ్రోజులూ

వంశీ ఆర్ట్స్ (వరంగల్) వారు ఇటీవల ధ్వన్యనుకరణ సామ్రాట్ శ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 50వ జన్మదిన సందర్భంగా జరిపిన సన్మానోత్సవంలో వేణుమాధవ్ దంపతులని ఆశీర్వదిస్తూ అక్షతలు చల్లుతున్న సినీనటులు ధూళిపాళ, గుమ్మడి, మిక్కిలినేని గార్లని చిత్రంలో చూడవచ్చు.

వాళ్ళకి భోజనాలు మా అమ్మగారి చేత వండించి ఆ అరుగుల మీద వడ్డింపజేశారు. అమ్మ కొంచెం తటపటాయిస్తుంటే 'అరుగుకి మైల లేదని ధర్మ శాస్త్రంలో చెప్పబడిందే వెర్రిదానా. నిజంగా వాళ్ళకి అన్నదానం చేస్తున్న నిన్ను చూస్తుంటే వ్యాసుడికి శిష్య సమేతంగా భోజనాలు పెట్టిన అన్నపూర్ణాదేవి గుర్తుకొస్తుంది' అంటూ ఆమెను సమాధాన పరిచారు.

అయితే ఆ రెండ్రోజుల తర్వాత కూడా వరుణుడు శాంతించలేదు. ఆ రోజు సాయంత్రం యతిరాజులు భార్య ఏడుపు అరుగుల మీద కలకలా వినిపించాయి. యతిరాజులు బాణంలా దూసుకొని వచ్చి నాన్నగారి పాదాలకు నమస్కరించి కళ్ళ నీళ్ళు పెటుకున్నాడు. విషయం అర్థం కాక నాన్నగారు కలవరపడ్డారు.

"సాత్రులుగారూ... మీ అరుగు మీదకి ఈ యెదవ సంతని తీసుకొచ్చి సాలా తప్పసేసాను. నన్ను సెమించాలి... మా ఆడదానికి నెలలు నిండినయ్ బాబూ... నొప్పలతో మెలికలు తిరిగిపోతోంది. ఉన్న పళంగా ఏడకెల్లాలో నా కరదం కావడంలేదు బాబూ"

నాన్నగారు కొంచెం ఆలోచించి తలపంకించారు.

"అంతే కదా. నువ్వు కంగారు పడాల్సిన అవసరం లేదు. అటక మీద మన బండికి కట్టే గూడు చాప వుంటుంది. అది తెచ్చుకొని మన అరుగుకి అడ్డం కట్టుకో. పిల్లా పీచుతో సహా మిగతా వాళ్ళనందరినీ అవతల అరుగు మీదకు పంపించు. అనుభవం వున్న మీ ఆడాళ్ళని సాయం చెయ్యమను."

"వద్దు బాబూ... నేనంత గోరం సెయ్యలేను. సనువిచ్చినారు గదా అని పీ యిల్లు మైల సెయ్యలేను"

"ఇలాంటి కార్యాల వల్ల పుణ్యం తప్ప మైల సంక్రమించదురా. నువ్వు సందేహించక వెళ్ళి తొందరగా పని చూడు" నాన్నగారు పరమ శాంతంగా చెప్పారు.

యతిరాజులు భార్య అరుగుమీద తడక చాటునే ప్రసవించిందట. మగబిడ్డ కలిగాడు... నాన్నగారి ఔదార్యం, విశాల దృక్పథం — ఇంటా బయటా ముగ్ధుల్ని చేశాయి. ఊరూ వాడా గొప్పగా చెప్పకున్నారు. తెలియని సాంప్రదాయికులు కొందరు ఇదేం విడ్డూరమని ముక్కున వేలేసుకున్నారు.మరికొందరూ నాన్నగారినే 'ఈ అనాచార మేమిటని' అడిగారు. అప్పుడు నాన్నగారు చెప్పిన గంభీరమైన సమాధానం నేనెన్నటికీ మర్చిపోలేను. 'మానవతా వాదాన్ని మించిన వేదం లేదు' అని.

వర్షం వెలిసిపోయింది ... వర్షాలు గడిచి పోయాయి... నాన్నగారి తరం అంతరించి పోయింది.

నాన్నగారు కాలం చేసిన తర్వాత మాధవ, నేను ఇల్లు పొలం పంచేసుకున్నాం నేను ఉద్యోగరీత్యా హైదరాబాదులో స్థిరపడిపోవడంవల్ల ఆ 'ముదరా' పొలంలో చూసుకొని ఇల్లు పూర్తిగా మాధవకే ఇచ్చేశాను. మాధవకి ఏ చదువూ అబ్బక వ్యవసాయం చూసుకొంటూ పల్లెటూరులోనే ఉండి పోవాల్సి వచ్చింది. మా ఆశయాలు తారుమారయ్యాయి. వాడికి మొదట్నించీ పట్నవాసం అంటే

వివాహ వేదిక

(ప్రకటనదారులకు క్రొత్త అవకాశం)

రోజు రోజుకు సాంఘిక వ్యవస్థ, వివాహ తీరు తెన్నులు మారుతున్నవి. మారుతున్న ధోరణులకనుగుణంగా వివాహ సంబంధాల గూర్చి తగు సమాచారము సేకరించుటలో క్లిష్టత, త్రిప్పట, వ్యయం అధికమవుతున్నవి.

వధూవరుల కొరకు సమాచారము పత్రిక ద్వారా అందజేసుకోవడం వల్ల కొంత ఈ సమస్యకు పరిష్కారము కాగలదు. ఈ దృష్టితోనే ఆంధ్రపత్రిక (దినపత్రిక) లో వధూవరులను గూర్చిన ఒక ప్రకటనల వేదికను ప్రచురించదలచినాము. మామూలుగా అయ్యే చార్జీలపై 50% రాయితీతో అంటే మామూలు సంగ్రహ ప్రకటనలకు లైనుకు రూ.6లు చార్జీకి బదులు ఈ ప్రత్యేక కాలంలో లైనుకు రు 3-00 వంతున చార్జి వుంటుంది.(లైనులో సుమారు 15-16 అక్షరములు ఇమడగలవు) నాలుగు లైన్లకు తక్కువ లేకుండా ప్రకటన వుండాలి.

మీ ప్రకటన విషయము + చార్జీలను మని ఆర్డరు/డ్రాఫ్టు ద్వారా జతపరచి (బాక్స నెంబరు కోరేవారు అదనంగా రూ.5 లు చెల్లించాలి)

ఆంధ్రపత్రిక

గాంధీనగరం, విజయవాడ-3

లేదా

బషీర్ బాగ్, హైదరాబాద్-29కు

పంపవచ్చును.

సులభముగా ఇంగ్లీషు మాట్లాడుటకు



బాలాజీస్ ఈసీ వే టు స్పీక్ ఇంగ్లీష్

బడిలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు, ఇంగ్లీషు చదివికూడా వ్యాకరణ సంశయము గలవారికి, వ్యాకరణ లోపములు లేకుండా సరళముగా ఇంగ్లీషు మాట్లాడుటకు, వ్రాయుటకు, నేర్పించుటకు ఉపకరించే పుస్తకం!

ఉద్యోగులు, వ్యాపారస్థులు, ఇంగ్లీషులో ఎక్కువ పరిజ్ఞానము లేనివారికి, తెలుగుద్వారానే వ్యాకరణబద్ధంగా ఇంగ్లీషు నేర్చుకొనుటకు ఇది ఒక మంచి సాధనము!

ఈ పుస్తకం చదవడం ప్రారంభించగానే మీతోబాటుగా ఒక ఉపాధ్యాయుడు తోడున్నట్లే భావించగలరు!

మీ ఊరిలోని అన్ని బుక్‌షాపుల లోను లభిస్తుంది. వెల. రూ. 19-50

వివరములకు.
బాలాజీ పబ్లికేషన్స
103, పైక్రాఫ్ట్సురోడ్, మద్రాసు-600 014

BALAJI PUBLICATIONS
103, PYCROFTS ROAD
MADRAS-600 014

devi ads, ms 13

ఎత్తరుగుల లోగిలి

మక్కువ. నాకేమో ప్రశాంతంగా పల్లెలో గడపాలని. మాధవ కంటె వాడి భార్య రాధకి నాగరిక జీవితం మీద మరీ మోజు. నేను హైదరాబాదులో ప్రభుత్వంవారు కట్టించి యిచ్చిన కాలనీలో ఓ ఇంటివాణ్ణయాను. హైదరాబాదు వచ్చి మా యిల్లు చూసి అసూయపడిన రాధ ఊళ్ళో పాత యింటిని ఆధునికంగా మార్చాలని పట్టు పట్టిందట!

ఆస్తి పంపకాలు జరిగిన ఏడాదికే తమ్ముడు నాతో చెప్పకుండానే యింటి మార్పులు ప్రారంభించాడు. నేను హైదరాబాదు నుంచి ఆ రోజు వచ్చేసరికి పనివాళ్ళు అరుగులు బద్దలుకొడుతున్నారు. నాన్నగారి మాటలు గుర్తుకొచ్చి నా కళ్ళు చెమ్మగిల్లాయి. వాళ్ళని ఆపుచేసి తమ్ముణ్ణి పిలిచి అడిగాను.

"నీకే? హైదరాబాదులో అందంగా యిల్లు కట్టుకొని మాకు ఎన్ని నీతులైనా చెపుతావ్. సంప్రదాయం పేరు చెప్పి మమ్మల్ని గబ్బిలాల్లా బతకమంటావా? అంతా ఈ పాతింటిని చూసి నవ్వుతున్నారు."

మాధవ నాతో అంత ధైర్యంగా ఎప్పుడూ మాట్లాడలేదు. స్వరం మాధవదైనా అక్షరాలు రాధవని గ్రహించి నేను మారు పలకలేదు.

గునపాలు అరుగుల్ని కాదు.. నా హృదయాన్ని బద్దలు కొడుతున్నట్లనిపించింది.

చిన్నతనంలో నేనూ, మాధవా ఆ అరుగులమీదే మా వీధి పిల్లలతో కలిసి పడుకొని పిడకల్ని, దుంగల్ని కాపలా కాసుకొని భోగిమంటలు వేసుకున్నాం.

కృష్ణాష్టమికి మా వీధికి దేవుడి పల్లకీ వచ్చేసరికి ఆలస్యమయ్యేది. అప్పటివరకు ఆ అరుగుల మీదే ఆడుకొని పిచ్చుక గొట్టాలు చిమ్మేవాళ్ళం.

నాన్నగారి చివరిరోజుల్లో ఆయన అరుగుమీద పడక కుర్చీలో చేరబడి గీతాపారాయణం చేస్తూ దారంటపోయే నలుగుర్ని పిల్చి వాళ్ళకి మంచీ చెడ్డా చెపుతూ కాలక్షేపం చేసేవారు.

గత దృశ్యాలు కళ్ళముందు మెదులుతూ హృదయాల్ని 'నిప్పుల కుంపటి' చేశాయి. అందుకే మళ్ళీ మళ్ళీ మాధవ యింటికి రావాలనిపించేది కాదు.

*　　*　　*

ఆంధ్రపత్రిక
దినపత్రికలో
* మన సినిమాలు
* వింత యదార్థం
శీర్షికలు
చూస్తున్నారా?

గోడకి చేరబడి గతంలోకి జారిపోయిన నన్ను మాధవ పలకరించాడు. అంత దుఃఖంలోనూ నన్ను లోపలకు వెళ్ళి కూర్చోమన్నాడు. చనిపోయిన వెంకట శాస్త్రిగారు స్వయంగా మా మాధవ మావగారు ఒకప్పుడు బాగా శ్రీమంతుడు.

"మాధవా. మీ మావగారికీపరిస్థితి రావడం నాకు చాలా బాధాకరంగా వుంది. అసలేం జరిగింది?"

"వ్యసనాలకి ఆస్తికాస్తా హారతి కర్పూరమై పోయింది

ఆరోగ్యం కూడా చెడిపోయింది. ఆఖరి దశలో కొడుకు కూడా చేరనివ్వకపోతే మేమే ఆదుకొని హాస్పిటల్‌లో జాయిన్ చేశాం. మూత్రపిండాలు చెడిపోయాయట డాక్టరుగారు లాభంలేదు, తీసుకుపొమ్మన్నారు. తీరా యింటికి తీసుకొచ్చి గడ్డిలో వేస్తే చావకుండా బ్రతక్కుండా కోమాలో ఆ ర్రోజు ల్నుంచీ అలాగే వున్నాడు తీరా యింట్లోపోతే యిల్లు మైలపడిపోతుందని బయట ఈ యేర్పాటు చేసి మేం విసిగిపోయి యతిరాజుల్ని కాపలాపెట్టాం"

"అయ్యయ్యో ఎంతటి వాడికెలాంటి గతి పట్టింది" నా హృదయం ఆర్ద్రమైంది

తెల్లవారే వరకు శవజాగరణ తప్పలేదు తెల్లారిన తర్వాత కూడా ఇరుగూపొరుగూ ఎవరూ అంతగా రాలేదు, వచ్చినవాళ్ళు కూడా నన్ను పలకరించి మాటవరసకి మాధవని పరామర్శించి పోయే వాళ్ళే తప్ప, నిలబడి సహాయం చేసినవాళ్ళు లేరు నాన్నగారు పోయినప్పుడు తీర్థంలా వీధి వీధంతా నిండిపోయి అన్ని యేర్పాట్లు చూసిన గ్రామస్థులు.. ఏమైనా ఆ తండ్రి కొడుక్కి ఆపద వచ్చినపుడు — ఏకాకిని చేసి పోవడం నాకు బాధగా వుంది.

ఇద్దరు ముగ్గురు నాతో రహస్యంగా చెప్పారు— మాధవ కాని, వాడి భార్యకాని వాళ్ళ గొడవ తప్ప ఎవరింట్లో ఏం జరిగినా పట్టించుకోరట అందుకే ఈ నిరసన.. మాధవ గిరి గీసుకొని సామాజిక వ్యవస్థకి దూరంగా పల్లెలో పట్నపు బ్రతుకును సాగిస్తున్నాడని నా కర్థమైంది.

"అన్నయ్యా నాకేం అనుభవం లేదు నువ్వే కావాల్సిన ఏర్పాట్లను చూసి పెట్టాలి" మాధవ ప్రాధేయపడుతున్నాడు

కబురు చేస్తే అతికష్టంమీద మాధవ బావమరిది వచ్చాడు. అతను తలకొరివి పెట్టాడు. నాకు, మాధవకి తోడు ఇద్దరు కిరాయి శవవాహకుల్ని పిలిపించాను.

'పాడె' లేస్తుంటే నా కనిపించింది —

'ఓ హరిజన స్త్రీ ప్రసవ సమయానికి ఆపద్ధర్మంగా ఆదుకొన్న ఈ లోగిలి కావలసిన మనిషికి మరణావస్థలో నీడ నివ్వలేకపోయిందే? ఆ అరుగులూ ఇరుగు పొరుగు సంబంధాలు వుంటే వెంకటశాస్త్రికి దిక్కులేని చావు, ఈ దుర్గతీ పట్టేవా? మళ్ళీ జోడరుగుల లోగిళ్ళు వుండే వ్యవస్థ వస్తే ఎంత బాగుండును!' అని. ★